క్లుప్తంగా

ఫర్టిలైజర్ డీలర్లు రసీదు ఇవ్వాల్సిందే



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రమీల

దొర్నిపాడు: రసాయన ఎరువులు, మందులు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల ఫర్టిలైజర్ షాపుల యజమానులకు సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లో మందుల వివరాలు ఉండాలన్నారు. ఆర్‌టీఐ యాక్టు ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన ఏదైనా సమాచారం అడిగే హక్కు అందరికీ ఉందన్నారు. అనంతరం మండలంలోని అర్జునాపురం, అమ్మిరెడ్డి నగరం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.

లింగవివక్షను నిర్మూలించాలి

నంద్యాల(అర్బన్): సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, లింగ వివక్షతకు తావివ్వరాదని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా అన్నారు. నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో బుధవారం లింగ వివక్షతపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాండురంగాపురంను ఫ్రెండ్లీ ఉమెన్ విలేజ్‌గా ప్రకటించారు. డీఎల్‌డీఓ శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

మందుబాబుకు ఝులక్

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి మోటార్ బైక్‌ను నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి బుధవారం శిక్షను ఖరారు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని వీసీ కాలనీకి చెందిన పామన్న గారి నరసింహులు మద్యం సేవించి మోటార్ బైక్ నడుపుతూ పద్మావతి నగర్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. వారు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడంతో పాజిటివ్ రావడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా నిందుతుడికి 15 రోజులు జైలు శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

137 పాఠశాలల్లో నేషనల్ సర్వే

నంద్యాల(న్యూటౌన్): జాతీయ విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పరఖ్-24 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో 137 పాఠశాలల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ సెయింట్ జోసెఫ్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు మూడేళ్లకోసారి ఈ సర్వే నిర్వహించి ఫలితాల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన పాఠ్య ప్రణాళికలు రూపొందించేలా నిర్ణయాలు తీసుకుంటాయన్నారు. డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, యూనస్‌బాషా, లలితమ్మ, వెంకట ప్రసాద్, వెంకటరమణ ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విచారణ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సతీష్ కుమార్ సస్పెన్షన్‌పై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. పాఠశాలలో పనిచేసిన హిందీ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ సమాచార హక్కు చట్టం దుర్వినియోగం, పాఠశాల రికార్డుల మార్పిడి, ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలతో 2022వ సంవత్సరం నవంబర్ నెలలో అప్పటి హెచ్‌ఎం రామచంద్రారెడ్డి సిఫారసు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయంపై సతీష్‌కుమార్ అప్పట్లో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటనపై విచారణ జరపాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చాడేశ్వరి, సి.బెళగల్ ఎంఈఓ ఆదాంబాషాను కడప ఆర్జేడీ నియమించారు. ఈ మేరకు విచారణాధికారులు పాఠశాలలో అప్పట్లో పనిచేసిన హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, సతీష్‌కుమార్, ప్రస్తుత హెచ్‌ఎం సుందరయ్య, రికార్డు అసిస్టెంట్ సోమశేఖర్‌లను విచారించారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి

పగిద్యాల: వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని సీపీఎం బృందం సందర్శించి గిట్టుబాటు ధరపై రైతులను ఆరా తీశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కేసీ ఆయకట్టు కింద, బావులు, బోర్ల వద్ద రైతులు సోనా మసూరి, నంద్యాల సోనా రకం వరి పంట సాగుకు ఎకరాకు సుమారు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారని, ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. గతంలో వరి బస్తా(70కేజీలు) ధర రూ. 2,300కు విక్రయించిన రైతాంగం ఈ ఏడాది వ్యాపారులు రూ.1500కు కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రస్తుత ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల్లో కూరుకుపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు బాబు, స్వాములు, రాముడు ఉన్నారు.

పల్లెకు రాని వెలుగు బస్సు

- పలు గ్రామాల ప్రజల అవస్థలు
- ప్రయాణికులకు ఆటోలే గతి
- పాఠశాల విద్యార్థులకు తిప్పలు





నంద్యాల నుంచి గ్రామాలకు వెళ్లేందుకు ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్న గ్రామస్తులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు రాకపోవడంతో ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటోలు, పలురకాల వాహనాలను ప్రయాణాలకు ఆశ్రయించాల్సి వస్తోంది. వాటిలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పది గ్రామాలకు ఒకే బస్సు..

నంద్యాల ప్రాంతంలోని చాపిరేవుల, తొగర్చేడు, పుసులూరు, బ్రాహ్మణపల్లె, మిట్నాల, గుంతనాల, తేళ్లపురి, కూలూరు, రాయపాడు, వల్లంపాడు, లింగాల గ్రామాలకు ఒకే బస్సు ఉండడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 2 పూటలు మాత్రమే కోవెలకుంట్ల డిపోకు చెందిన ఒకే బస్సు ఉండడంతో ఇక్కట్లు తప్పడంలేదు. గతంలో ఈ మార్గంలో నంద్యాల డిపో నుంచి, బనగానపల్లె డిపో నుంచి ఆర్టీసీ బస్సులను నడిపేవారు. అయితే దాదాపు 10 సంవత్సరాల నుంచి ఈ రహదారిలో ఒక్క బస్సు మాత్రమే నడుస్తోంది. దీనిపై ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ప్రయాణికులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రతి రోజూ ఈ గ్రామాల ప్రజలు వ్యవసాయ పనులకు, ఉద్యోగాలకు, విద్యార్థులు చదువుకునేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా బస్సు సౌకర్యం లేక ప్రత్యామ్నాయంగా ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో పనులకు, విద్యార్థులు కళాశాలలకు, ఉద్యోగులు విధులకు సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నంద్యాల డిపో నుంచి టంగుటూరు వరకు ఒక బస్సు, గుంతనాల వరకు మరో బస్సు, బనగానపల్లె డిపో నుంచి నంద్యాలకు ఈ గ్రామాల మీదనే నడిపేవారు. అలాగే కోవెలకుంట్ల డిపో నుంచి ఈ రహదారిలో రెండు బస్సులు నడిపేవారు. ప్రస్తుతం బస్సులు లేక విద్యార్థులు సైతం ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లా కేంద్రం కావడంతో ఈ రహదారిలోని గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం పలు అవసరాల నిమిత్తం అధిక సంఖ్యలో వస్తూ పోతుంటారు. వారంతా బస్సులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నారు..

బస్సు సౌకర్యం సరిగా లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చేందుకు ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మిట్నాల, పుసులూరు, చాపిరేవుల గ్రామాల మధ్య ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

“కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నాం

నంద్యాలలోని కళాశాలలకు వెళ్లేందుకు సమయానికి బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆటోలో ఎక్కువ మందిని ఎక్కిస్తుండడంతో ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. ఆటోల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో విద్యార్థుల కోసం విద్యార్థి బస్సు ఉండేది. అధికారులు విద్యార్థుల మొర ఆలకించి బస్సులు నడపాలి. పరీక్షల సమయంలో బస్సులు లేక బైక్‌లపై వెళ్లే సమయంలో కుక్కలు, పందులు అడ్డు రావడంతో ప్రమాదాల బారిన ఘటనలు అనేకం ఉన్నాయి.

– హయగ్రీవాచారి, రాయపాడు

“బస్సు సౌకర్యం కల్పించాలి



నంద్యాల డిపో నుంచి చాపిరేవుల, మిట్నాల, తేళ్లపురి, టంగుటూరు మీదుగా బనగానపల్లె వరకు, గతంలో ఉన్న బనగానపల్లె, నంద్యాల డిపోల బస్సులు నడపాలి. అదనంగా బస్సు సర్వీసులను నడపాలని డీఎంకు వినతి పత్రం అందజేశాం. ఆర్టీసీ అధికారులు ఈ గ్రామాల ప్రజలపై శ్రద్ధ చూపడం లేదు. అధికారులు స్పందించి బస్సులు నడపాలి. – మధు, ఎస్.కూలూరు

“ఆదివారం బస్సు ఉండదు



ప్రతి రోజూ రెండు పూటలా తిరిగే కోవెలకుంట్ల–నంద్యాల బస్సు ఆదివారం వచ్చే సరికి తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ బస్సు వస్తుందనుకుని ప్రయాణికులు, ప్రజలు, యువకులు వస్తుంటారు. సాయంత్రం 7 గంటలు కాగానే బస్సు రాలేదని డిపోకు ఫోన్ చేస్తే ఆదివారం బస్సు సర్వీసును నడపడం లేదని కోవెలకుంట్ల ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రతి రోజూ బస్సు నడపాలి.

– భిక్షేశ్వరరెడ్డి, తేళ్లపురి

పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ బిల్లు ఆదా



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీఈ

రుద్రవరం: విద్యుత్ వినియోగదారులు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ రవికాంత్ చౌదరి సూచించారు. ఆయన బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండలంలోని విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్ అందించే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రవేశ పెట్టిందన్నారు. సొంతిళ్లు కలిగిన ప్రతి వినియోగదారుడు ఆ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇంటి పైకప్పుపై సౌర పలకలను అమర్చుకొని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలన్నారు. సౌర విద్యుత్ వాడటం వల్ల 300 యూనిట్ల వరకు విద్యుత్ చార్జీల మినహాయింపు ఉంటుందని వివరించారు. ఇల్లు, విద్యుత్ కనెక్షన్ రెండూ ఒకరి పేరిట ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆ పథకం ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 300 యూనిట్ల వరకు ఇంటికి వినియోగించుకోవచ్చని ఆపై 600 యూనిట్ల విద్యుత్‌ను నెట్ మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చని వివరించారు. 3 కిలోవాట్ల సౌర విద్యుత్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.45 లక్షలు ఖర్చవుతుందని అందులో కేంద్రం రూ.78 వేలు రాయితీ ఇస్తుందని చెప్పారు. ఏఈ రాజశేఖర్ ఉన్నారు.

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



సుద్దమల్లలో సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఉయ్యాలవాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేస్తామని క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు స్పష్టం చేశారు. ఆయన బుధవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, సుద్దమల్ల గ్రామాల్లో రూ.1.20 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయాల భవనాలు, ఉపాధి హామీ పథకం కింద సుద్దమల్లలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్ల నాణ్యతను పరిశీలించారు. ఆయా పనుల్లో సిమెంట్, కంకర, స్టీలు, ఇసుక ఏ మేరకు వినియోగించారో తెలుసుకునేందుకు పరికరాల ద్వారా నమూనాలు తీసుకున్నారు. వీటిని నంద్యాల ల్యాబ్‌కు పంపనున్నట్లు డీఈ వెల్లడించారు. ఏఈలు నాగలక్ష్మయ్య, వెంకటయ్య, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంట ఉన్నారు.

వరి పంటను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: మండలంలో సాగుచేసిన వరిపైరు కోత దశలో ఉన్నందున ఇటీవలి వర్షాలకు పొలంలో నీటి నిల్వ చేరకుండా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని ఏఓ రంగనేతాజి సూచించారు. ఆయన బుధవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దూరు, నగళ్లపాడు గ్రామాల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉందని, తుపాను ప్రభావానికి పంట దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. పైరు నేల వాలకుండా వరి దుబ్బులను కట్టలు కట్టి, గింజలు నీటిలో తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరిమడులలో చేరిన నీటిని బయటకు పంపాలన్నారు. తడిసిన వరి ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. అలాగే రైతులు ఈ నెల 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించి పంటబీమా చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

‘ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు’ పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక చాంద్‌బాడాలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో బుధవారం ప్రముఖ రచయిత, అనువాదకులు మండపేట ముహమ్మద్ షరీఫ్ రచించిన ‘ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు’ తెలుగు పుస్తకాన్ని జమాతే ఇస్లామీ హింద్ శాఖ అధ్యక్షుడు అబ్దుల్ సమద్, జకారియా చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవం కోసం తమ జీవితాలను అంకితం చేసిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 27 మంది త్యాగధనుల సంక్షిప్త సమాచారంతో ముహమ్మద్ షరీఫ్ కూర్పు ముస్లిం యువతకు స్ఫూర్తి అన్నారు. 90 పేజీలలో దివంగత నాయకుల చరిత్రను రాబోయే తరాలకు దిక్సూచిగా పరిచయం చేస్తూ, జమాతే ఇస్లామీ 75 వసంతాల సందర్భంగా రచయిత బహూకరించారని అన్నారు. ఖిద్మత్ బీఎంసీ అధ్యక్షుడు యూనస్ బాషా, ముహమ్మద్ ఫయాజ్, సయ్యద్ జమీలుద్దీన్, ముహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ

బనగానపల్లె : రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చెరువుపల్లె గ్రామంలో బుధవారం స్థానిక వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాల గురించి వివరించారు. అలాగే పండ్లాపురం గ్రామంలో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన పట్టణంలోని పవన్ ఫర్టిలైజర్స్, సత్యం కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలించారు. ఆ తరువాత అవుకు మండలంలోని గుండ్లశింగవరం మొక్కజొన్న రైతుల ఫిర్యాదు మేరకు బనగానపల్లెలో ఉన్న లలిత ట్రేడర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనం ద్వారా వచ్చే సమస్యలను ఆ గ్రామ రైతులకు వివరించారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ వ్యవసాయాధికారి రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉయ్యాలవాడ: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన మాయలూరు, 7న హరివరం, 10న అల్లూరు, 11న తుడుమలదిన్నె, 12న ఎస్.కొత్తపల్లె, 13న ఆర్.పాంపల్లె, 17న సర్వాయిపల్లె, 18న ఉయ్యాలవాడ, 20న పెద్దయమ్మనూరు, 21న బోడెమ్మనూరు, 27న పడిగెపాడు, 28న ఆర్.జంబులదిన్నె, వెంగంపల్లె గ్రామాలు, 31న ఇంజేడు, జనవరి 2న కొండుపల్లె, 4న కాకరవాడ, 7న రూపనగుడి, గోవిందపల్లె, 8న నర్సిపల్లె, సుద్దమల్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తోందని చెప్పారు. రైతులు సదస్సుల్లో అర్జీలను అందజేసి భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరు సమీపంలో మోటర్ సైకిల్ నుంచి కింద పడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తలూరు గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ధనపాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా వరి కోత మిషన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నర్సాపురం వద్ద ఉంటూ చుట్టుపక్కల గ్రామాల రైతుల పొలాల్లో వరి కోతలు చేపట్టేవాడు. ఈ క్రమంలో బుధవారం నర్సాపురం నుంచి ముత్తలూరులో ఉన్న యంత్రం వద్దకు మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని గ్యారేజ్‌లో పారిశుద్ధ్య పనులను, పనిముట్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కొత్తగా పరికరాలు వచ్చాయన్నారు. మున్సిపల్ కార్మికులు పరికరాలను తీసుకొని వెళ్లి శానిటేషన్ పనులకు ఉపయోగించుకోవాలన్నారు. కమిషనర్ వెంట డీఈ అబ్దుల్‌రసూల్, ఏఈ అబ్దుల్‌బాబావలీ, గుర్రప్ప, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు

రుద్రవరం: అదనపు కట్నం వేధింపులకు గురిచేసిన కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. నర్సాపురం గ్రామానికి చెందిన సుజాతకు ఏడాది క్రితం మైదుకూరుకు చెందిన సుమంత్‌తో పెద్దలు వివాహం చేశారు. గత ఆరు నెలల నుంచి భర్తతో పాటు అత్త సారమ్మ, మామ రామసుబ్బయ్య అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను వేధించసాగారు. వారి వేధింపులు తాళలేక బాధితురాలు సుజాత ఫిర్యాదు ఇవ్వడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించి మెగా లోక్ అదాలత్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెగా లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులతోపాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని, దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని న్యాయవాదులకు సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ఏపీపీ సోమశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు

పకడ్బందీగా ఎన్‌ఏఎస్ పరీక్షలు



చింతలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ న్యామతుల్లా

చాగలమర్రి: విద్యా వ్యవస్థల పనితీరును తెలుసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్లకోసారి విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలను నిర్వహిస్తోందని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా అన్నారు. చాగలమర్రి మండలంలో బుధవారం నిర్వహించిన ఎన్‌ఏఎస్–24 సర్వే పరీక్షకు మండలంలోని 6 ఎయిడెడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 179 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. చాగలమర్రి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి, ముత్యాలపాడు ఎయిడెడ్ ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో 6, 9 తరగతులు, చింతలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, చాగలమర్రిలోని ఎయిడెడ్ ఆర్‌సీఎం పాఠశాల, పెద్దబోధనం ఉన్నత పాఠశాలలలో 3వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణకు ఏడుగురు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, ఏడుగురు అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణను ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా పర్యవేక్షించారు. అన్నికేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓలు వెల్లడించారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ పరిరక్షణ వేదిక నాయకులు



ఆళ్లగడ్డలో ర్యాలీ చేపట్టిన హిందూ సంఘాలు

నంద్యాల(వ్యవసాయం): బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ సంస్థలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్, బీజేపీ హిందూ పరిరక్షణ వేదిక సంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టెక్కె భరతమాత గుడి నుంచి బయలుదేరి శ్రీనివాసనగర్ నాగులకుంట రోడ్ గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంటరీ నాయకుడు అభిరుచి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అక్కడి ప్రభుత్వం అరికట్టాలని కోరారు. ఇస్కాన్ అధ్యాత్మిక గురువు చిన్మాయ్ దాస్‌ను విడిపించి, అక్కడి హిందువులకు రక్షణ కల్పించాలన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. హిందూ సంఘం నాయకులు కొట్టి చంద్రశేఖర్, శ్రీదేవి, విష్ణువర్ధన్ రెడ్డి, పోలేపల్లి సందీప్, ఇనుగూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను సహించేది లేదని హిందూ సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండు మీదుగా నాలుగు రోడ్లకూడలి వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇస్కాన్ స్వామి చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లోని మైనార్టీలకు యావత్ భారతదేశం అండగా నిలుస్తుందన్నారు. వారి రక్షణకు అంతర్జాతీయ సమాజం బంగ్లా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఇస్కాన్ నిర్వాహకులు కేశవ ప్రభు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నీలకంఠం, త్రినేత్ర మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు

నేటి నుంచి విద్యుత్ కోతలు

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణంలోని 220/132/33 కేవీ సబ్ స్టేషన్‌లో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈలు రమేష్‌కుమార్, సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ను సర్దుబాటు చేయడంలో భాగంగా నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు, పాణ్యం, వెలుగోడు ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

బదిలీ ఏఆర్ డీఎస్పీకి సన్మానం



ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: బదిలీపై వెళుతున్న ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులును బుధవారం ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. 1996 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు ఆర్ ఎస్ఐగా హైదరాబాద్ సిటీలో బాధ్యతలు స్వీకరించారన్నారు. అక్కడి నుంచి పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించి ఈ ఏడాది డీఎస్పీగా పదోన్నతి పొందారని వివరించారు. జిల్లాలో 10 నెలలు సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రస్తుతం అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారని చెప్పారు. డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు నాగభూషణం, మంజునాథ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.